క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు



తన్నీరు నాగేశ్వరరావు   ఇంటూరి చిన్నా

జగ్గయ్యపేట అర్బన్: దీపావళి సందర్భంగా ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి ఇంటా ఈ పండుగ వెలుగులు నింపాలని, వారి జీవితాలలో నూతన కాంతులను నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచన, విశేష హోమాలతో పాటు పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణల నడుమ కన్నుల పండువగా జరిపించారు. ఈఓ ఫణికుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 23 మంది ఎంపిక



పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల్లో బుధవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన టెక్నోడైన్ ఇన్ఫర్మేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మౌఖిక, రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. అసోసియేట్ ఇంజినీర్లుగా ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 4.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల్లో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కే రామ్మోహన్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ చిరంజీవి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఉక్కు కళావేదికపై రాజకీయ నీడలు

- కళావేదిక ద్వారం మూసేసి షాపు నిర్మించాలని ప్రయత్నం
- కౌన్సిల్ తీర్మానంపై పోరాటం చేస్తున్న వైస్ చైర్మన్ హఫీజున్నీసా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ నడిబొడ్డున ఉన్న ఉక్కు కళావేదిక(టౌన్‌హాల్)పై రాజకీయ మేఘాలు అలముకున్నాయి. పట్టణంతో పాటు నియోజకవర్గ కేంద్రంలో సభలు, సమావేశాలు, శుభకార్యాలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు విశాఖపట్నం వారి సౌజన్యంతో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన ఉక్కు కళావేదిక పాలకుల రాజకీయ స్వార్థంతో వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చేందుకు వేదిక సిద్ధం అయింది. తమకు ఉపయోగపడే వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రజల ఆస్తులను సైతం పణంగా పెట్టేందుకు ఏమాత్రం వెనుకాడటంలేదు.

పాలకుల అడుగులకు మడుగులు

చట్టాన్ని పరిరక్షించాల్సిన వారే పాలకుల అడుగులకు మడుగులు ఒత్తేందుకు చట్టసభలను ఉపయోగించుకుంటూ తీర్మానాలను ఆమోదింపజేస్తున్నారు. ఇటీవల జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఉక్కు కళావేదిక రెండో ద్వారం మూసివేసి, పాలకులకు అనుకూలమైన వ్యక్తికి మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపును నిర్మించి ఇవ్వాలని ఈ నెల 24న కౌన్సిల్‌లో ఎజెండాలోని 45వ అంశంగా తీర్మానం చేయడమే ఇందుకు నిదర్శనం. ఇది చట్ట వ్యతిరేకం, ప్రజావ్యతిరేకమైన పని కావడంతో తాను కూడా భాగస్వామి కాలేక వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా వ్యతిరేకించారు. అంతేకాక ఆమె ఒక మహిళ అయినప్పటికీ ఇది ఏమాత్రం జరగడానికి వీల్లేదంటూ పట్టుబట్టి మున్సిపల్ కమిషనర్‌కు డీసెంట్ లెటర్ ఇచ్చి, కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులకు పంపారు.



పేటలో ఉక్కు కళావేదిక (టౌన్‌హాల్) భవనం



ఉక్కు కళావేదిక ద్వారం

స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సహకారంతో..

- జగ్గయ్యపేట నడి బొడ్డున శుభకార్యక్రమాలను నిర్వహించుకునేందుకు గత పాలకులు(ఉదయభాను) విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సహకారంతో 2009లో నిర్మాణం చేపట్టి తరువాత 2022లో ప్రారంభోత్సవం చేశారు.
- టౌన్‌హాల్లో జరిగే పంక్షన్లలో వేలాదిమంది పాల్గొంటారు కాబట్టి, భవిష్యత్‌లో భద్రతా రీత్యా తొక్కిసలాట సమస్య దృష్ట్యా వాయువ్య మూలన కూడా రెండో ద్వారం ఏర్పాటు చేయాలని అప్పటి పాలకులు, అధికారులు 25-11-2019న ఎజెండా నెం.153 ద్వారా కౌన్సిల్ తీర్మానం చేసి ఎస్‌యూబీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఒక షాపును తొలగించాలని తీర్మానం చేశారు. ద్వారానికి అడ్డువచ్చే విధంగా ఉన్న ఒక షాపును దాని లీజుదారుడి సమ్మతితోనే తొలగించి ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఇది జరిగి దాదాపు ఐదేళ్లు అయింది. అయితే మళ్లీ ఇప్పటి పాలకులు తిరోగమనంగా నిర్ణయం తీసుకోవడంతో సమస్య మొదటికి వచ్చి వివాదాస్పదంగా మారింది.

న్యాయపోరాటం చేస్తాం



ఎన్నో వేలమందికి సౌకర్యవంతంగా ఉన్న ఉక్కు కళావేదిక ద్వారాన్ని తొలగించాలని నిర్ణయించడం ప్రజావ్యతిరేక చర్య. దీనిపై న్యాయపోరాటం చేస్తాం. ప్రజల సౌకర్యార్థం ఇంకా సులభతరం చేయాల్సింది పోయి ఉన్న ద్వారాన్ని మూసివేయాలని చూడటం పూర్తిగా టౌన్‌ప్లానింగ్ విధానానికి వ్యతిరేకమే. దీనిని రాజకీయ కోణంలో కాకుండా ప్రజల సౌకర్యార్థంలో భాగంగా చూడాలి.

– పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల కన్వీనర్

ద్వారం మూసివేత నిర్ణయం విరమించుకోవాలి



ఒక ప్రైవేటు వ్యక్తికి లబ్ధి చేకూర్చేందుకు వేలమందికి సౌకర్యవంతంగా ఉన్న టౌన్‌హాల్ ద్వారం మూసివేసి, ఐదేళ్ల క్రితం తొలగించిన షాపును పునర్నిర్మాణం చేయాలని కౌన్సిల్ తీర్మానం చేయడం చట్ట వ్యతిరేకమైన చర్య. దీనికి కౌన్సిల్ సమావేశాన్ని వేదిక చేయడం దురదృష్టకరం. దీనిని వెంటనే ఆపివేయాలని మున్సిపల్ కమిషనర్, చైర్మన్, కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులకు డీసెంట్ లెటర్ ఇచ్చాను. ప్రజల సమస్యపై ఉద్యమం కొనసాగిస్తాం.

– షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్

డీసెంట్ తదుపరి చర్యలు తీసుకుంటాం



ఉక్కు కళావేదిక ద్వారం వద్ద ఎస్‌యూబీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మరొక షాపును నిర్మించాలని కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ సభ్యులు తీర్మానం చేశారు. దీనిపై వైస్ చైర్మన్ హఫీజున్నీసా తమతో పాటు జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులకు డీసెంట్ లెటర్ పంపారు. డీసెంట్ ఇచ్చారు కాబట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

క్రక్స్ బయోటెక్స్‌లో సీఐడీ సోదాలు

నందిగామ టౌన్: మండలంలోని పెద్దవరం గ్రామంలోని క్రక్స్ బయోటెక్స్ కంపెనీలో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కంపెనీకి సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కంపెనీ ఉత్పత్తి, ఎగుమతులు, స్టాక్‌కు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. గత ప్రభుత్వం హయాంలో మద్యం తయారీకి సంబంధించి బయోటెక్స్ కర్మాగారాల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదులు రావటంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా క్రక్స్ బయోటెక్స్ కర్మాగారంలో సైతం అధికారులు తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 33 మందికి మంజూరైన రూ.18 లక్షలకు సంబంధించి సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

గుండెపోటుతో విద్యుత్ శాఖ ఏడీఈ మృతి

నందిగామ టౌన్: విద్యుత్ శాఖ నందిగామ ఏడీఈ రమేష్‌బాబు గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు విజయవాడలోని ఆయన నివాసంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావటంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఈ దిబ్బయ్య, జేఈ గౌతమ్, కాంట్రాక్టర్ రామారావు, ఏఏఓ రవికుమార్, ఎల్ఐలు, లైన్‌మెన్, ఏఎస్‌ఎంలు, రీడర్లు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మోటార్ల దొంగల అరెస్ట్



కేసుల వివరాలను తెలియజేస్తున్న ఏసీపీ రవికిరణ్



మోటార్లు, ముద్దాయిలతో ఏసీపీ, సీఐ, ఎస్ఐలు

జగ్గయ్యపేట అర్బన్: పలు గ్రామాల్లో బోరు బావి మోటార్ల చోరీకి పాల్పడుతున్న దొంగలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ మాట్లాడారు. గత కొన్ని రోజులుగా జగ్గయ్యపేట మండలం, చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న వరుస మోటార్ల దొంగతనం కేసులకు సంబంధించి కమిషనర్ ఆఫ్ పోలీస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ వారి ఆదేశాల మేరకు నిందితుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బుధవారం చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాసరావు పట్టణ సమీపంలోని షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్ వద్ద నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారని పేర్కొన్నారు. పల్నాడుకు చెందిన సిమ్మసర్తి నాగతిరుమల, షేర్‌మహ్మద్‌పేటకు చెందిన బొజ్జగాని కేశవ, తుమ్మగూడెంకు చెందిన చీటిపోతుల చెన్నారావు, బురుగడ్డకు చెందిన వేముల నాగరాజుగా గుర్తించినట్లు తెలిపారు. సదరు వ్యక్తులు పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తిరుమలగిరి, బలుసుపాడు, పోచంపల్లి గ్రామాల్లో బోరు బావి మోటార్లు మొత్తం ఏడు చోరీ చేసి, వాటిని అమ్మేందుకు వెళుతుండగా సిబ్బంది సాయంతో చిల్లకల్లు ఎస్ఐ వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న మోటార్లను మధ్యవర్తుల సాయంతో స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మోటార్ల విలువ రూ 1.50 లక్షలు ఉంటుందన్నారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకున్న చిల్లకల్లు ఎస్ఐ, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు ఏసీపీ రవికిరణ్ తెలిపారు.

పండగ సందడి

పెనుగంచిప్రోలు: టపాసుల దుకాణాల వద్ద సందడి మొదలైంది. బుధవారం ఉదయం నుంచే స్థానికంగా ఏర్పాటు చేసిన టపాసుల విక్రయించే స్టాల్స్ వద్ద పండగ వాతావరణం కనిపిస్తోంది. అయితే సాయంత్రానికి భారీ వర్షం పడటంతో దుకాణాల ముందు నీళ్లు నిలబడ్డాయి. వ్యాపారాలు ఎలా ఉంటాయో అని వ్యాపారులు భయపడుతున్నారు.

కొండచిలువ హల్‌చల్



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో బుధవారం భారీ కొండ చిలువ హల్‌చల్ చేసింది. స్థానిక మునేరు కాజ్‌వే అవతల రైతులు గేదెకు జాడు కోయటానికి వెళ్లారు. అక్కడ పొలంలో కొండ చిలువ కనిపించింది. దీంతో భయంతో స్థానికులు కట్టెలతో దాన్ని కొట్టి చంపారు.

ఇసుక డంప్ సీజ్

కంచికచర్ల: స్థానిక చెవిటికల్లు రోడ్డులో కపిల్ స్ట్రీట్ ప్రైవేటు ప్లాట్స్‌లోని ఖాళీ స్థలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను పోలీసులు గుర్తించి బుధవారం సీజ్ చేశారు. ఎస్ఐ రాజు మాట్లాడుతూ ఒక వ్యక్తి రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి డంప్ చేశాడని సమాచారం మేరకు డంప్ చేసిన ఇసుకను గుర్తించామన్నారు. ఆ ఇసుకను సీజ్ చేసి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



బండారును పరామర్శిస్తున్న జగన్‌మోహనరావు, అవినాష్, నాయకులు



కరిముల్లాను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అధైర్యపడొద్దని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలో అధికార పార్టీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులకు గురైన వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ కరిముల్లా, అనుమోలు పార్థసారథి, బండారు వెంకట్రామ్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అవినాష్, జగన్‌మోహనరావు మాట్లాడుతూ అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతోందన్నారు. న్యాయ, అన్యాయాలను మరిచి అధికార పార్టీ నాయకుల ఆదేశాలే శిరోధార్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై న్యాయస్థానాలను ఆశ్రయించటం జరుగుతుందని చెప్పారు.

రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు నల్లగట్ల స్వామిదాసు, తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రెడ్డి, జిల్లా స్థాయి నాయకులు నల్లగట్ల సుధారాణి, అంజిరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మహ్మద్ మస్తాన్, పాకాలపాటి కిరణ్, మువ్వల శ్రీను, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నరేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కేవీకేలో నిర్వహిస్తున్న సమగ్ర పోషకాల యాజమాన్య శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేవీకే కో-ఆర్డినేటర్ అచ్యుతరాజు మాట్లాడుతూ 15 రోజులుగా జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల సిబ్బందికి సమగ్ర పోషకాల యాజమాన్యంపై అవగాహన కలిగించామన్నారు. వారు తీసుకున్న శిక్షణను గ్రామాల్లోని రైతులకు వివరించాలని తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు ప్రభావతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు రూ.10 నాణేలు



జగ్గయ్యపేట ఐసీఐసీఐ బ్యాంకులో నగదు కోసం వేచి ఉన్న కార్యదర్శులు



బ్యాంకులో అందించిన రూ.10 నాణేలు

జగ్గయ్యపేట: దీపావళి సందర్భంగా గురువారం బ్యాంకులకు సెలవు కావటంతో మండలంలో నవంబరు ఒకటి నుంచి పింఛన్లు పంపిణీ చేసేందుకు నగదు డ్రా చేసేందుకు బుధవారం బ్యాంకులకు వెళ్లిన గ్రామ కార్యదర్శులకు వింత పరిస్థితి ఎదురైంది. జగ్గయ్యపేట ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బంది రూ.10 లక్షలకు రూ.10 నాణేలను అందించటంతో కార్యదర్శులు ఒక్కసారిగా విస్తుపోయారు. అంతే కాకుండా పింఛన్‌దారులు తీసుకుంటున్న పింఛన్‌కు ఇన్‌కం ట్యాక్స్ కట్టాలని బ్యాంకు సిబ్బంది చెబుతుండటంతో కార్యదర్శులు, డీడీఓలు ఒకరి ముఖం ఒకరు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఎంపీడీఓ నితిన్‌కు తెలపగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. చిల్లర నగదును అందించటంతో పింఛన్‌దారులకు అందించేందుకు తలప్రాణం తోకకొస్తుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామాల్లో ఇప్పటికే రూ. 10 నాణేలు చెల్లటం లేదనే అపోహలు ఉండటంతో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

కంచికచర్ల : కంచికచర్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాళ్లను బుధవారం ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ పరిశీలించారు. ఈ మేరకు ఏసీపీ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. షాపుల వద్ద అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి షాపు వద్ద నీరు, ఇసుక, అగ్నిని ఆర్పే ఫేర్ మిషన్ పరికరం విధిగా ఉండాలన్నారు. కంచికచర్లలో తొమ్మిది దుకాణాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అధిక ధరలకు టపాలుసు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ రాజు పాల్గొన్నారు.



కంచికచర్లలో బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న ఏసీపీ రవికిరణ్

జాగ్రత్తలు పాటించాలి

జగ్గయ్యపేట అర్బన్: టపాసుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు షాపులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణదారులు ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పివేసేందుకు కెమికల్ గ్యాస్, నీరు ప్రతి దుకాణం వద్ద విధిగా ఉంచుకోవాలని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అదే స్థలంలో అందుబాటులో ఉండాలన్నారు. షాపులు రాత్రి 9 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచాలని, పండుగ రోజు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే షాపులు ఉంచాలని తెలిపారు. ఫైర్ సర్వీస్, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటేశ్వరరావుకు సూచించారు.

నిబంధనలు తప్పనిసరి

జుజ్జూరు(వీరులపాడు): బాణసంచా దుకాణాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ అనిల్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.10 లక్షల చెక్కు అందజేత



వత్సవాయి: క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి సీఎం సహాయనిధి చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథజనార్దన్ అందజేశారు. వత్సవాయి గ్రామానికి చెందిన గుత్తా బాబు కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయాన్ని టీడీ జనార్దన్ దృష్టికి తీసుకువెళ్లగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.10 లక్షలను వైద్యఖర్చుల కోసం మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం గుత్తా బాబుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షులు జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, పెద్ది రామారావు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నందిగామ టౌన్: నందిగామ ఐసీడీఎస్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ భాగ్యరేణుక కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ చందర్లపాడు మండలంలో ఒక కార్యకర్త, ఒక సహాయకురాలు పోస్టు ఉండగా నందిగామ మండలంలో రెండు సహాయకురాలు పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల-4 కేంద్రానికి అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), వెలదికొత్తపాలెం-2 కేంద్రానికి సహాయకురాలు (ఎస్సీ) నందిగామ పట్టణంలోని కొత్త హరిజనవాడ కేంద్రానికి సహాయకురాలు (ఎస్సీ) మండలంలోని కంచల-2 కేంద్రానికి సహాయకురాలు (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను నవంబరు ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఘనంగా సామూహిక కుబేర వ్రతం



జగ్గయ్యపేట: పట్టణంలోని పెద్ద రామాలయంలో దీపావళి సందర్భంగా బుధవారం సామూహిక శ్రీలక్ష్మీ కుబేర వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై పలువురు దంపతులు పీటలపై కూర్చుని వ్రతం నిర్వహించారు. ప్రభుత్వ మాజీ విప్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుమ్మేపల్లి నరేంద్ర, ఆర్యవైశ్య నాయకులు చారుగుండ్ల కొండ, వెన్నా ప్రశాంత్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, AT HUZURNAGAR.
I.A.No.427 OF 2024 IN OS.No.38 OF 2014

BETWEEN: Zuari Cements Limited (Sri Vishnu Cement Limited) Seethapuram of Dondapadu Village, Chintalapalem Mandal, Suryapet District, Rep. by its Manager, HR & Admn Mr. Lugendra Pillai. K

...Petitioner / Plaintiff

And

R2. Kasarla VijayaLaxmi, W/o late Bhaskar Rao, Age: 46 yrs, Occ: Household., R/o H.No.12 - 271, Alasapuri Street. Jaggaiahpet Town &Mandal, NTR District.

R3. Kasarla Sridevi, D/o Late Bhaskar Rao, Age: 26 yrs, Occ: Household, R/o H.No. 12-271, Alasapuri Street, Jaggaiahpet Town and Mandal, NTR District.

R4. Kasarla Anitha sri, D/o Late Bhaskar Rao, Age: 24 yrs, Occ: Household, R/o H.No. 12-271, Alasapuri Street, Jaggaiahpet Town and Mandal, NTR Dist.

R5.Kasarla Sunitha, D/o late Bhaskar Rao, Age: 22 yrs, Occ: Household, R/o. H.No.12-271, Alasapuri Street, Jaggaiahpet Town and Mandal, NTR Dist.

R6. Kasarla Durga Bhavani, D/o late BhaskarRao, Age: 20 yrs, Occ: Household, R/o H.No.12-271, Alasapuri Street, Jaggaiahpet Town &Mandal, NTR District.

R11. Kasarla Santha ram, S/o Battar Daasan, Age: 49 yrs, Occ: Employee, R/o Kakatiya Cements, Srinivasanagar, Jaggaiahpet Town & Mandal, NTR District.

....Respondents/Defendants No.2 to 6 & 11

NOTICE

The petitioner has filed above I .A No.427/2024 in OS No.38/2014 seeking for restoration of the suit and your appearance is necessary for filing any objections. The above case is posted to 26-12-2024 for considering the same and if anybody is having objections with this regards they may appear at 10.00 A.M on 26.12.2024 before the Junior Civil Judge Court at Huzurnagar either in person or through your pleader. Otherwise the court will decide the matter according to the merits of the petition.

//BY COURT ORDER//

Date: 29-10-2024
Place: Huzurnagar

Sd/- BOBBA KOTI REDDY
ADVOCATE
HUZURNAGAR, SURYAPET DISTRICT,
TELANGANA STATE
CELL No.9705391234